క్లుప్తంగా

విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ



విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సున్నం అభిరామ్

కూనవరం: మండలంలోని వెంకన్నగూడెం, శ్రీరామ్‌పురం, పంద్రాజుపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు హోప్ చారిటబుల్ సొసైటీ సమకూర్చిన నిత్యావసర సరకులను సర్పంచ్ సున్నం అభిరామ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు హోప్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ఒక్కో విద్యార్థికి 10 కేజీలు బియ్యం, నూనె, గోధుమ రవ్వ, ఉప్మా రవ్వ, ఉప్పు ప్యాకెట్ కేజీ, టీపొడి అరకేజీ చొప్పున అందజేశారు. ఈకార్యక్రమంలో హోప్ సంస్థ ఇన్‌చార్జి యోహాన్, యాసిన్, మణికుమార్, పాస్టర్ ప్రభాకర్, తరుణ్, రవి, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



గంగవరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గంగవరం : గ్రామాల్లో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని అప్రమత్తతో అవగాహనతో మెలగాలని స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ అన్నారు. స్థానిక వై.జంక్షన్‌లో సైబర్ నేరాలపై బుధవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు వారి బ్యాంకు ఖాతా వినియోగంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల విషయాలను రహదారి భద్రత నియమాలను విధిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

కనులపండువగా ఉమామహేశ్వరుని కల్యాణం




పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: సీలేరులోని ఉమామహేశ్వర ఆలయంలో శివ పార్వతుల కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, కుంకుమ పూజలు చేపట్టి కల్యాణాన్ని జరిపించారు. ఇందులో దంపతులు చేతుల మీదుగా పూజలను అర్చకులు దామోదరం నిర్వహించారు.గురువారం సీలేరు పురవీధుల్లో ఊరేగించి ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

అడ్డతీగల: అమలిక ఏకాదశి పురస్కరించుకుని స్థానిక పవనగిరి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనారాయణుడు ఆలయంతో పాటు ఉసిరి చెట్టుకి విశేష పూజలు గావించారు. పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చన చేసి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వెంకట రామయ్య

ఘనంగా ఆలయ శంకుస్థాపన

దేవరాపల్లి: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు పాల్గొని భక్తిశ్రద్ధలతో భూమి పూజ చేశారు. జై వాసవి, జైజై వాసవి అంటూ భక్తుల నినాదాలతో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది.

మన్యంలో ప్రగతి పరుగులు

- కోట్లాది రూపాయలతో లోగిలి, కండ్రూం వంతెనల నిర్మాణం
- గిరిజనుల హర్షం



లోగిలి వంతెన



అందుబాటులోకి వచ్చిన కండ్రూం-చటువ వంతెన

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): మన్యం ప్రగతి పథకంలో పరుగులు తీస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో శివారు గ్రామాల్లోనూ రహదారులు, వంతెనలు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు తదితర మౌలిక సౌకర్యాలు దర్శనమిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్య ప్రాంతం కనీస అభివృద్ధికి నోచుకోలేదు. అధ్వాన దారులు, తాగునీటి ఇక్కట్లు తదితర సమస్యలతో గిరిజనం సతమతమయ్యారు. అప్పటి టీడీపీ పాలకులు కనీసం పట్టించుకోకపోవడంతో సమస్యలతోనే సావాసం చేశారు. వర్షాకాలంలో పొంగి ప్రవహించే గెడ్డలను దాటి గ్రామాలకు వెళ్లలేక నరకాన్ని చూసేవారు..అదంతా గతం.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక మన్య ప్రాంతాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. ఏజెన్సీలో ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయం కల్పించేందుకు కోట్లాది రూపాయలు మంజూరు చేశారు. మన్య ప్రాంతం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయంతో పాటు అభివృద్ధి జరగడంతో ప్రజలంతా మళ్లీ సీఎం జగన్ కావాలని కోరుకుంటున్నారు. రహదారులు, వంతెనలు జోరుగా జరిగాయి. పేదల జీవితాల్లో కొత్త కాంతులు వచ్చాయి. కొన్ని దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారం లభించాయి.

నెరవేరిన దశాబ్దాల వారధి కల

డుంబ్రిగుడ మండలం ఒడిశా సరిహద్దు కండ్రూం - చటువ వంతెన నిర్మాణానికి మోక్షం లభించింది. కండ్రూం గెడ్డ వద్ద వంతెన నిర్మాణం జరగక కండ్రూం పంచాయతీ ప్రజలతో పాటు ఒడిశా రాష్ట్ర ప్రజలు సైతం అనేక అగచాట్లు పడేవారు. వర్షాకాలంలో గెడ్డలు పొంగి ప్రవహిస్తుండటంతో గెడ్డలు దాటలేక అనేక ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో అరకులోయ రావాలంటే 30 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ప్రాంతంలోని గెడ్డపై రూ. 5.80 కోట్లు వెచ్చించి వంతెన నిర్మించడంతో కేవలం 12 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. దీంతో ఆదివాసీల కష్టాలకు తెరపడింది. వంతెన ప్రారంభం కావడంతో ఆంధ్రా ప్రజలతో పాటు ఒడిశా రాష్ట్ర ప్రజలు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు సజావుగా జరుపుకుంటున్నారు.

శరవేగంగా వంతెన నిర్మాణం

టీడీపీ ప్రభుత్వ హయాంలో కొట్టుకుపోయిన లోగిలి వంతెనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోక్షం లభించడంతో ఆదివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.1.80కోట్ల నిధులు మంజూరు చేయడంతో 18 నెలల కాంట్రాక్టు గడువుతో ప్రారంభించిన వంతెన కేవలం 9 నెలల్లోనే వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. దీంతో ఆదివాసీలు జగనన్న ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. గిరిజనుల అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ వంతెన నిర్మాణమే నిదర్శనమని గిరిజనులు చెబుతున్నారు.

కష్టాలు గట్టెక్కాయి



దశాబ్దాల వంతెన కళ నేరవేరింది. ఆదివాసుల కష్టాలకు తెరపడింది. గతంలో వంతెన నిర్మాణం జరగక అనేక కష్టాలు ఎదుర్కొన్నాం. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి వంతెన నిర్మించాలని కోరగా నిదులు మంజూరు చేసి 9 నెలల్లోనే పూర్తి చేయడం అభినందనీయం. ఆనందంగా ఉంది.

– వంతాల జిమ్మ, ఎంపీటీసీ, గసభ పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

మార్గం సుగమం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో తామంతా అరకులోయ, ఒడిశా రాష్ట్రం చటువా, శిమిశిగుడ ప్రాంతాలకు తక్కువ సమయంలో వెళ్లి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించగలుగుతున్నాం. మార్గం సుగమమైంది.

– ముత్తెం వినోద్ కుమార్, సరాయి గ్రామం, డుంబ్రిగుడ మండలం

త్వరితగతిన పనులు



డుంబ్రిగుడ మండలం, గసభ పంచాయతీ లోగిలి వంతెన నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోని శరవేగంగా పూర్తి చేసి గిరిజనులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో నిధుల కొరత లేనందున వంతెన అత్యంత వేగంగా పూర్తి చేశాం. చాలా గ్రామాలకు రాకపోకలకు మార్గం సుగమమైంది.

– తుమ్మిడి అభిషేక్, ఏఈఈ, టీడ్ల్యు, అరకులోయ

చిరుజల్లులు.. ఆనందంలో రైతులు



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

హుకుంపేట: మండల కేంద్రాంతో పాటు మండలంలోని గూడ, మఠం, సంతారి, రాప, మత్స్యపురం, శోభకోట, తడిగిరి, మట్టుజోరు, అడ్డుమండ, బాకురు తదితర పంచాయతీల్లో బుధవారం తొలకరి వర్షం చినుకులు పడ్డాయి. పొలాల్లో నీరు చేరడంతో గిరిజనులు రైతులు ఆనందం వ్యక్తం చెశారు. తొలకరి పనులకు సంసిద్ధమవుతున్నారు.

ముంచంగిపుట్టు:మండలంలో బుధవారం ఆకాశమంత మేఘావృతమై ఉండి మధ్యాహ్నం అయ్యేసరికి ఒక్కసారిగా చిరుజల్లులు కురిశాయి.గత కొన్ని రోజులుగా ఎండ వేడితో అల్లాడిన మండల వాసులకు ఈ జల్లులుతో కొంత వేడి నుంచి ఉపశమనం లభించింది.ముంచంగిపుట్టు మండలంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. విరగసిన మామిడి పూతకు ఈ జల్లులు ఎంతో మేలు చేస్తాయని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా బుధవారం ఆకాశం మేఘావృతం అయ్యి చిరు జల్లులు కురిశాయి. మరోవైపు చల్లని గాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. దీంతో అప్పటి వరకు వేసవి వేడిమితో అల్లాడుతున్న ప్రజానీకం ఉపశమనం పొందారు.వర్షం మామిడి, జీడిమామిడి తోటలకు, వేసవి పంటలకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

కొత్తాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



కొత్తాడలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గంగవరం: పిడతమామిడి పిహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ ఆధ్వర్యంలో కొత్తాడ సబ్‌సెంటర్ ఆవరణలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 104 వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా, పిడతమామిడి పిహెచ్‌సీ వైద్య సిబ్బంది సేవలందించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బలమైన పోష్టకాహారాన్ని తీసుకోవాలని ఆవగాహన కల్పించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో 70మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు వైద్యాధికారి సాయిరతన్ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ మానస, సూపర్‌వైజర్లు లక్ష్మి, వీర్రాజు, ఏఎన్‌ఎం మాధవి, జయకుమారి, 104 సిబ్బంది మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలికి అభినందనలు



పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మిను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని అభినందిస్తున్న ఎంపీటీసీ విజయకుమారి

పాడేరు/జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిను బుధవారం పార్టీ ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఆమెను అభినందించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, ఏఎంసీ చైర్మన్ సూరిబాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్ లకే రామసత్యవతి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బసవన్నదొర, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, జి.మాడుగుల ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, పాస్టర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబురావు, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, సామేలి లక్ష్మణరావు, కుర్రబోయిన సన్నిబాబు, ఎంపీటీసీలు సల్లా చిట్టమ్మ, రామకృష్ణ, నర్శింహామూర్తి, తదితరులున్నారు.

గ్రామంలో యువకుల హల్‌చల్



గుమిగూడిన జనం

సీలేరు: ఆంధ్ర –ఒడిశా సరిహద్దు సీలేరు సమీపంలోని పిల్లిగెడ్డ గ్రామంలో బుధవారం సాయంత్రం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలో కొంతమంది కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తుండడంతో స్థానికులు వారిని అదుపులో తీసుకున్నారు. ఇటీవల ఏజెన్సీలో దొంగతనాలు, చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే దుండగలు వచ్చారనే వదంతుల వార్తలు, వీడియోలు సోషల్‌మీడియాలో రావడంతో గ్రామస్తులు అప్రమత్తమై గ్రామంలో సంచరిస్తున్న వారిని పట్టుకొని బంధించి, సీలేరు ఎస్ఐ రామకృష్ణకు సమాచారం అందించారు. దీంతో సీఐ అప్పలనాయిడు సిబ్బంది కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకులను అన్ని కోణాల్లో విచారణ చేపట్టగా చెడు వ్యసనాలకు బానిస అయి ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్టు గుర్తించారు. వీరంతా మైదాన ప్రాంతానికి చెందిన వారని దొంగతలు కాదని, భయాందోళన చెందవద్దని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారికి కొట్టవద్దని గ్రామస్తులకు సూచించారు.

నేడు మండల సమావేశం

అరకులోయ రూరల్: ఎంపీపీ రంజపల్లి ఉషారాణి ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు



పరీక్ష కేంద్రంలో బందోబస్తు సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంతో పాటు జోలాపుట్టులో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను సీఐ రమేష్ బుధవారం తనిఖీ చేశారు.పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరీక్ష ఇన్విజలేటర్లకు పలు సూచనలిచ్చారు. అనంతరం బందోబస్తు సిబ్బందితో మాట్లాడుతూ పరీక్ష జరుగుతున్న సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. జోలాపుట్టు గ్రామ పంచాయతీ కేంద్రంలో పోలీసుశాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నూతన చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. సీఐ రమేష్ చెక్ పోస్టును పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం, నగదు వంటి రవాణా జరగకుండా తనిఖీలు చేయాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు సేకరించి విడిచిపెట్టాలని, అప్రమత్తంగా ఉండాలని చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. ఏఎస్ఐ లక్ష్మణరావు, ఆర్ఐ భూపతిపడాల్, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

చింతూరు: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎంఈవో లక్ష్మీనారాయణ బుధవారం తనిఖీలు చేశారు. నర్సింహాపురం గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పరీక్షల తీరును ఆయన పరిశీలించారు. దీంతో పాటు గురుకుల పాఠశాలలో ఉదయం జరిగిన ఓపెన్ టెన్త్, మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా స్థానిక గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష జరుగుతున్న సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నా గుంపుగా జనాలు ఉండడంపై ఎంఈవో లక్ష్మీనారాయణకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి తక్షణమే పరీక్ష కేంద్రం గేటు వద్ద ఎవరూ గుమిగూడకుండా చూడాలని, పోలీసులు చర్యలు చేపట్టాలని చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించినట్టు తెలిపారు.

జగనన్న ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్



టి.డి.గుడలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్

అరకులోయ రూరల్: జగనన్న ప్రభుత్వంతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇరగాయి పంచాయతీ పరిధిలోని టి.డి.గుడ, ఉరములు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగనన్న ఎంతో అవసరమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోని గ్రామాలు...నేడు జగనన్న పాలనలో ఎన్నడూ ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చి ఉత్తమ బోధనతో విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేశారన్నారు. జగనన్న ప్రభుత్వంతోనే మరింత సంక్షేమాభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీగా డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్యేగా రేగం మత్స్యలింగంను గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని పిలుపునిచ్చారు. సర్పంచ్ మాదల బుటికి, ఎంపీటీసీ సభ్యురాలు జన్ని చెల్లమ్మ, నాయకులు నొబో, రామ్మూర్తి, రఘు, నర్సింగ్, పూర్ణ, రామరావు, భాస్కర్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



పాటిగరువులో గిరిజనులతో పార్టీ శ్రేణులు

హుకుంపేట: మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో మండలంలోని దుర్గం పంచాయతీ సరసుపాడు, పాటిగరువు, కొత్తవలస,దారగెడ్డ, అల్లంపుట్టు, నందిపుట్టు, రణంకోట, చీడిగరువు తదితర గ్రామాల్లో బుధవారం నాయకులు పర్యటించారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలించిన సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, నాయకులు ధర్మయ్యదొర, మత్స్యలింగం, చిన్నబ్బి, వెంకట్, శ్రీను, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ హంసబంధ, బురుసిందిపుట్టు, పుచ్చలి, బలియాగూడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నేతలు కోరారు. సర్పంచ్ భాగ్యవతి, నాయకులు పద్మారావు, రాంప్రసాద్, సురేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నాయకం రాంచదర్ కుటుంబాన్ని బుధవారం సర్పంచ్ భాగ్యవతి, నాయకులు పరామర్శించి, బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



కందులగాదిలో పర్యటిస్తున్న ఎంపీపీ అనూషదేవి



పుచ్చిలిలో పర్యటిస్తున్న నాయకులు

చింతపల్లిరూరల్: మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కందులగాదిగ్రామంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందించిన సీఎం జగనన్నకు అందరూ అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. పార్టీ నాయకులు వైఎసోసర్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ, నాయకులు జల్లి సుధాకర్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు నాగుర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కల్యాణోత్సవాలు ప్రారంభం



ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 134వ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణ తంతు వేదమంత్రాల సాక్షిగా పూర్తి చేశారు. పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం

రోలుగుంట: స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలను ముత్యా రామస్వామి (వైశ్య కుటుంబాలు) ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముత్యాల వారి కుటుంబీకులు సత్యనారాయణ, పెద్దియ్య, నారాయణమూర్తి, నాగేశ్వరరావు తదితరులు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వైభవంగా రామాలయ ప్రారంభోత్సవం

నాతవరం: పి.కె.గూడెంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవంతోపాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు బుధవారం వైభవంగా జరిగాయి. వేదమంత్రోచ్చారణల నడుమ విగ్రహ ప్రతిష్ట, అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవీ పెద్దింటమ్మ ఉత్సవాలు కుసుర్లపూడిలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వేకువజాము నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ చుక్కా సత్తిబాబు, పంచాయతీ పాలక సభ్యులు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ మడ్డు అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ నెల 24 తేదీ వరకూ ఈ ఉత్సవాలతోపాటు రోజూ మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రిళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఆదివారం అమ్మవారి ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలి

మారేడుమిల్లి: పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మారేడుమిల్లిలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లోత రామరావు కోరారు. ఆయన బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందన్నారు. ఈ ప్రాంతంలో వేలాది మంది టూరిస్టులు పర్యటిస్తున్నారని, ఇక్కడ జీవవైవిధ్యాన్ని కాపాడే విధంగా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజన మ్యూజియంతో పాటు ఆదివాసీ భవనం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.